క్లుప్తంగా

రక్తదాన శిబిరం



గ్రంథాలయంలో రక్తదానం చేస్తున్న యువకులు

గుర్ల: గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ రామారావు ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. విజయనగరానికి చెందిన ఎంవీఎస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది శిబిరంలో 30 మంది యువకుల నుంచి రక్తం సేకరించారు. శిబిరాన్ని సందర్శించిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు, ఉపాధ్యాయుడు మీసాల శివాజీ రక్తదాతలను అభినందించారు. స్థానిక నాయకులు ఇజ్జిరోతు ప్రసాద్, కిలారి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చీరలు, దుప్పట్ల పంపిణీ

జామి: అలమండ గ్రామంలోని చినరామకోవెల భజన మండలిలో మహిళా సభ్యులకు ఆలయ ధర్మకర్త లగుడు అప్పలనాయుడు శుక్రవారం దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. 40మంది మహిళలకు రూ.15 వేల విలువైన చీరలు, దుప్పట్లు అందజేశామని దాత చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆరాద్యుల సత్యనారయణ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి మోడల్ స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 హాకీ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ప్రసన్న లక్ష్మి శుక్రవారం తెలిపారు.జిల్లా కేంద్రం విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో బాలికల విభాగంలో ఇంటర్మీడియట్ విద్యార్థిని ఎస్.జ్యోష్నభార్గవి, బాలుర విభాగంలో 9వ తరగతి విద్యార్థులు ఎస్.గిరిచరణ్, బి.రోహన్, ఎం.చరణ్, జి.మోహిత్‌కుమార్, కె.పవన్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థుల ను, పీఈటీ రాజేష్‌ను ఎంఈఓలు ఎం.వెంకటరావు, సుధాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

నేత్ర వైద్య శిబిరం

చీపురుపల్లి: మండలంలోని రామలింగాపురం గ్రామంలో చీపురుపల్లి పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్ర వారం నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు 55 మందికి నేత్ర పరీక్షలు చేసి, 22 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి పుష్పగిరి కంటి ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించనున్నామని మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గోవింద రాజులు తెలిపారు.

వంటపాత్రల వితరణ



శివ స్వాములకు వంట పాత్రలు, పూజాసామగ్రి అందజేస్తున్న దాతలు

గుర్ల: మండల కేంద్రంలోని శివాలయంలో దీక్ష చేస్తున్న శివస్వాములకు స్థానికులు రాలి ప్రసాదరావు, రాలి శ్రీనివాసరావు సుమారు రూ.60 వేల విలు వైన వంటపాత్రలు, పూజా సామగ్రిని శుక్రవారం అందజేశారు. దాతలకు గురుస్వాములు నేరడబిల్లి ఈశ్వరరావు, అంబటి లక్ష్మణ శివ స్వాములు తోలా పు మహేష్, సారిక సత్యం ,వాల్లె వెంకటరమణ, తదితరులు దన్యవాదాలు తెలిపారు.

సమ్మె నోటీసు అందజేత

గజపతినగరం / శృంగవరపుకోట: తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 25 నుంచి సమ్మెకు దిగుతామని108 ఉద్యోగులు స్పష్టం చేశారు. గజపతినగరం మండల కేంద్రంలో 108 ఉద్యోగులు శుక్రవారం నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు పెండింగ్ జీతాలను చెల్లించాలని, ప్రభుత్వమే 108 సర్వీస్‌లను నిర్వహించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ బి.రత్నకుమార్‌కు సమ్మెనోటీసు అందజేశారు. అలాగే ఎస్.కోట నియోజకవర్గంలో పని చేస్తున్న 108 ఉద్యోగులు ఎస్.కోటలో తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీ ఓ సతీష్‌ను వారి కార్యాలయాల్లో కలిసి వేర్వేరుగా సమ్మె నోటీసులు ఇచ్చా రు.

తహసీల్దార్‌కు వినతి..

వేపాడ : ఈ నెల 18న జిల్లా సీసీఎల్ఏ కార్యాలయం వద్ద నిర్వహించనున్న రాయబారి కార్యక్రమానికి హాజరయ్యేందుకు తమకు అనుమతి ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ రాములమ్మకు వీఆర్ఏలు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్ఏల మండల అధ్యక్షుడు దువ్వాడ అశోక్, మండల కార్యదర్శి ఆతవ హేమలత, తదితరులు మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి రాయబారి కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు.

జగనన్న పాలనలో వెలసిన ఊళ్లు

- వైఎస్సార్‌సీపీ హయాంలో నెరవేరిన పేదల సొంతింటి కల
- సొంత స్థలం లేని వారికి జగనన్న కాలనీల్లో పట్టాలు, ఇళ్లు మంజూరు
- జగనన్న కాలనీల్లో సకల సదుపాయాలు



ఎస్.కోట జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లు



ఎస్.కోటలోని జగనన్న కాలనీ



చీపురుపల్లి జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చీపురుపల్లి: 2014 నుంచి 2019 మధ్య కాలంలో చంద్రబాబు హయాంలో ఎవరైనా పేదలు ఇళ్లు నిర్మించుకుందామంటే ప్రభుత్వం నుంచి సహకారం కరువయ్యేది. ఇళ్లు ఎప్పుడు మంజూరు చేస్తారా అని పేదలు ఎదురు చూసేవారు. సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకుంటాం, మంజూరు చేయండి ప్రభో అని వేడుకున్నా నాటి పాలకు లు పట్టించుకున్న పాపాన పోలేదు. అరకొరగా ఇళ్లు మంజూరు చేస్తే.. వాటికోసం జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చుకోవాల్సిన దుస్థితి. భూమి లేని పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఊసే లేదు. సెంటు భూమి కూడా లేని, అద్దె ఇళ్లలో జీవనం గడుపుతున్న పేదలు ఇక తమ జీవిత కాలంలో సొంతింటి కల సాకారం కాదేమో ననే నిర్ణయానికి వచ్చేశారు.అటువంటి పేదల సొంతింటి కల 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సాకారమయ్యింది. రాష్ట్రంలో సొంత ఇల్లు లేని వారు ఉండకూడదని, ప్రతి అక్క, చెల్లి తమ పిల్లలతో సొంత ఇంట్లోనే ఉండాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తలంచాడు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో జగన్ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా ఇళ్లు మంజూరు చేశారు.

అన్ని సదుపాయాలతో జగనన్న కాలనీలు

సొంత స్థలం లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వమే భూములు కొనుగోలు చేసింది. ప్రభుత్వం సేకరించిన భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లను తలపించే విధంగా లేఅవుట్లు వేసి ప్లాట్లను సిద్ధం చేశారు. ఇళ్ల పట్టాలు అందజేయడంతో పాటు ఇళ్ల నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్థిక సహాయం కూడా అందించింది. లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన వారు నివాసం ఉండేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్ల నిర్మాణం, విద్యుద్దీకరణ, రక్షిత మంచినీటి ట్యాంకులను నిర్మించి, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసి, సకల సదుపాయాలు కల్పించారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో జగనన్న కాలనీల్లో భాగంగా 77 లేఅవుట్లు ఏర్పాటు చేసి, అందులో 3,774 ప్లాట్లను పంపిణీ చేశారు. ఇళ్లు నిర్మించుకుంటామని ముందుకొచ్చిన 1,964 మందికి పక్కా ఇళ్లు మంజూరు చేశారు. వీరిలో 949 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు.ఎస్.కోట నియోజకవర్గంలోని ఎస్.కోట, కొత్తవలస, వేపాడ, జామి, ఎల్.కోట మండలాల్లో 110 లేఅవుట్లు ఏర్పాటు చేసి 3,407 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయగా వారిలో 1,532 మంది ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. గజపతినగరం నియోజకవర్గంలోని దత్తిరాజేరు, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ మండలాల్లో జగనన్న లేఅవుట్లలో పట్టాలు పొందిన వారితో పాటు సొంత స్థలాలు ఉన్న7,837 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయగా, 4878 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. దశాబ్దాలుగా సొంతింటి కోసం ఎదురు చూసిన పేదల కల జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో నెరవేరిందనేందుకు జగనన్న కాలనీల పేరిట వెలిసిన ఊళ్లే అందుకు నిదర్శనం. ఎంతోమంది పేదలు ప్రస్తుతం జగనన్న కాలనీల్లో తమ సొంత ఇంటిలో సంతోషంగా ఉంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇన్నీ చేసినా పచ్చమీడియా వంకర రాతలు రాస్తూ వాస్తవాలను దాస్తుండడంపై లబ్ధిదారులు మండిపడుతున్నారు.



చీపురుపల్లి జగనన్న కాలనీలో రక్షిత మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిలు



గుర్ల మండలంలోని గూడెం జంక్షన్‌లో జగనన్న కాలనీ



మెరకముడిదాం జగనన్న లేఅవుట్‌లో నిర్మించిన ఇళ్లు



గజపతినగరం మండలంలోని పురిటిపెంటలో జగనన్న కాలనీ



గజపతినగరం నియోజకవర్గంలోని కోమటిపల్లి జగనన్న కాలనీ

చీపురుపల్లి నియోజకవర్గంలో జగనన్న లేఅవుట్లు, మంజూరైన ఇళ్ల పట్టాలు, పక్కా ఇళ్ల వివరాలు..

మండలం	లేఅవుట్లు	ప్లాట్లు	మంజూరైన ఇళ్లు	నిర్మాణం పూర్తయినవి
చీపురుపల్లి	12	998	669	269
గరివిడి	19	1,155	648	290
గుర్ల	20	571	273	151
మెరకముడిదాం	23	1,050	375	240

ఎస్.కోట నియోజకవర్గంలో జగనన్న లేఅవుట్లతో పాటు, సొంత స్థలాల్లో మంజూరైన ఇళ్ల వివరాలు

మండలం	లేఅవుట్లు	మంజూరైన ఇళ్లు	నిర్మాణాలు పూర్తయినవి	సొంత స్థలాల్లో	నిర్మాణం పూర్తయినవి
కొత్తవలస	26	1,025	382	704	533
ఎల్.కోట	18	306	149	1,195	1,032
ఎస్.కోట	27	1,307	484	1,809	1,354
వేపాడ	28	340	175	1019	878
జామి	11	429	342	2,222	1,538

గజపతినగరం నియోజకవర్గంలో జగనన్న లేఅవుట్లతో పాటు, సొంత స్థలాల్లో మంజూరైన ఇళ్ల వివరాలు

మండలం	మంజూరైన ఇళ్లు	నిర్మాణం పూర్తయినవి
బొండపల్లి	2,037	1,382
దత్తిరాజేరు	1,932	1,178
గజపతినగరం	1,198	702
గంట్యాడ	2,670	1,616



చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి జి.అగ్రహారం సమీపంలో జగనన్న కాలనీలో నిర్మించిన ఇళ్లు



చీపురుపల్లి జగనన్న కాలనీలో విశాలమైన రహదారులు

సొంతింటి కల నెరవేరింది....



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో నాకు ఇళ్లు మంజూరయ్యింది. రూ.1.80 లక్షల బిల్లు కూడా ఇచ్చారు.మా కాలనీలో సిమెంట్ రోడ్డు కూడా వేశారు. ఇంటికి తాగునీరు కోసం కుళాయిఏర్పాటు చేశారు. కాలనీని అన్ని విధాలా అభివృద్ధి చేశారు.

– సువ్వాడ చిన్నమ్మలు, ఆనందపురం, గుర్ల మండలం

పేదలకు జగన్ అండ...



తమ ఏలుబడిలో ఏనాడూ ప్రజల కష్టం చూడనోళ్లు ఈయాళ కాలనీలు లేవు. ఇళ్లు లేవని చెప్పటానికి సిగ్గుండాలి. జగనన్న కాలనీలో ఇళ్లు కనిపించడం లేదా. ఇన్నేళ్లూ పేదోళ్లు జ్ఞాపకం రాలేదు. ఈయాల వచ్చి అవి ఇళ్లు కావు, రోడ్లు లేవు. నీళ్లు లేవు అని పిచ్చి మాటలు చెబుతున్నారు. పేదోడి కష్టం, కల తెలిసినోడు జగన్. ఈరోజు ధైర్యంగా, సంతోషంగా నా సొంత ఇంట్లో ఉంటున్నా. నాకు హోదా, ఆస్తి ఇచ్చింది జగన్

– కోడూరు పైడితల్లమ్మ, ఎస్.కోట

కష్టాలు తీరాయి



గత ప్రభుత్వం ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల బిల్లు ఇచ్చింది. ఎవరికీ రూపాయి లంచం ఇవ్వకుండానే ఇళ్లు మంజూరు అయింది. సొంతిల్లు నిర్మించుకోవడంతో కష్టాలు తీరాయి. ఇప్పుడు హాయిగా సొంత ఇంటిలో ఉంటున్నాం.

– బోడసింగి సీత, బోడసింగిపేట, బొండపల్లి మండలం

లక్ష్యాన్ని చేరుకోవాలి..



టెక్నికల్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్

మెరకముడిదాం: ఉపాధి పనుల్లో భాగంగా చేపడుతున్న ఇంకుడుగుంతలు, తోటగట్ల పనులను వేగవంతంగా చేసి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్ అన్నారు. మండలానికి చెందిన టెక్నికల్ సహాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలానికి సంబంధించి 1000 తోటగట్లు, 1000 ఇంకుడు గుంతలు టార్గెట్‌గా ఇచ్చారని, వీటిని వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

పరిశీలన..

కొత్తవలస: మండలంలోని చీపురువలస సమీపంలో గల ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు పైప్‌లైన్‌కు సంబంధించిన మోటార్ ఆపరేటర్ వాల్వ్ స్టేషన్‌ను విజయగనరం డివిజన్ ఆర్డీఓ దాట్ల కీర్తి శుక్రవారం పరిశీలించారు. ఈ స్టేషన్ సుమారు ఆరు సెంట్ల విస్తీరణంలో ఉందని.. ఈ ప్రాంతాన్ని నిషేధిత ప్రాంతంగా గుర్తించాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని చెప్పారు. ఆమె వెంట తహసీల్దార్ నీలకంఠరావు, ఆర్ఐ రాజేష్, తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి



నల్లబిల్లిలో సర్పంచ్‌కు వినతిపత్రం ఇస్తున్న 104 సిబ్బంది

వేపాడ: తమ సమస్యలను పరిష్కరించాలని 104 ఉద్యోగులు కోరారు. నల్లబిల్లి గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సూర్యకుమారిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సి బ్బంది సతీష్, తదితరులు మాట్లాడుతూ, ఏపీ 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు మొదటి రోజు సర్పంచ్‌లకు వినతిపత్రాలు అందజేశామన్నారు. తమను రెగ్యులర్ ఉద్యోగులు గా గుర్తించడంతో పాటు మెరుగైన జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు.

మద్యం దుకాణం వద్దంటూ ఆందోళన



మద్యం దుకాణం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

శృంగవరపుకోట: మద్యం దుకాణాన్ని తమ గ్రామ పొలిమేరల్లో ఏర్పాటు చేయవద్దంటూ మండలంలోని శివరామరాజుపేట గ్రామానికి చెందిన మహిళలు మండిపడ్డారు. ప్రభుత్వ లైసెన్సెడ్ మద్యం షాపు ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆ గ్రామ మహిళలు శుక్రవారం ఆందోళనకు దిగారు. శృంగవరపుకోట నుంచి శివరామరాజుపేటకు వెళ్లే రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటుకు నిర్వాహకులు కొత్తగా నిర్మాణం చేపట్టారు. ఇక్కడ మద్యం షాపు ఏర్పాటు చేయవద్దని,తాము పొలం పనులు ముగించుకుని ఇళ్లకు వచ్చేటప్పుడు మందుబాబులతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని మహిళలు అంటున్నారు. గతంలోనూ తాము ఇబ్బందులు పడ్డామని గుర్తు చేశారు. మందుబాబులతో తమ మానప్రాణాలకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి దుకాణాన్ని వేరే చోటుకు తరలించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బొండపల్లి సర్వేయర్‌గా చంద్రశేఖర్

బొండపల్లి: మండల సర్వేయర్‌గా ఏ.చంద్రశేఖర్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయనగరం తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. మండలంలో భూసర్వేలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



వెంకన్నను సన్మానిస్తున్న వీఆర్ఏలు, సీఐటీయూ నాయకులు

వేపాడ: వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రామస్వామిపేట వీఆర్ఏ గట్టు వెంకన్నను మండల వీఆర్ఏ లు, సీఐటీయూ నాయకులు శుక్రవారం సన్మానించారు. సీఐటీయూ నాయకుడు చల్లా జగన్ వెంకన్నకు అభినందనలు తెలిపి, వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు.

పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు

జామి: మండల వ్యాప్తంగా బెల్టు షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. విచ్చలవిడి అక్రమంగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. అధికారపార్టీ నాయకుల సహాయం, వారి ప్రోత్సాహంతో బెల్టు షాపులను దర్జాగా నడుపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జె.డి.వలసలో లైసెన్స్‌డ్ దుకాణం తరహాలోనే గ్రామంలో బెల్టు దుకాణం నిర్వహిస్తుండడంపై స్థానికుల ఫిర్యాదు మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడిచేశారు.ఈదాడిలో 18 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్టు షాపు నిర్వహిస్తున్న రాయవరపు శంకరరావుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ రాజేష్ తెలిపారు.

శంబలనగరిలో ఆకాశజ్యోతి



ఆకాశజ్యోతిని వెలిగిస్తున్న ఎంపీ భరత్‌కుమార్

శృంగవరపుకోట: కార్తీకపౌర్ణమి సందర్భం గారాజీపేట గ్రామంలోని గాయత్రీతపస్వి శంబలనగరి ఆశ్రమంలో శుక్రవారం భారీ ఆకాశజ్యోతిని వెలిగించారు. 300కిలోల ఆవునెయ్యి, 300మీటర్ల ఒత్తి, 9 కిలోల కర్పూరంతో 40 అడుగుల ఎత్తులో ఆకాశజ్యోతిని ఏర్పాటు చేశారు. ఈ ఆకాశజ్యోతిని విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ వెలిగించారు.ఈ సందర్భంగా 10వేల మందికి అన్నసమారాధన చేశారు. ఎంపీ వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్, గొంప కృష్ణ, ఆ పార్టీ మండల అధ్యక్షుడు జి.ఎస్.నాయుడు, తదితరులున్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయాలి



ఓటరు జాబితాలో వివరాలను పరిశీలిస్తున్న ఈఆర్ఓ ప్రమీలా గాంధీ

బొండపల్లి: తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాల్సిన బాధ్యత బీఎల్ఓలపై ఉందని గజపతినగరం నియోజకవర్గం ఈఆర్ఓ ప్రమీలా గాంధీ అన్నారు.ఓటరు నమోదు, ఓటర్ల జాబితా మార్పులు, చేర్పుల కోసం మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాల్లో ఓటర్ల వివరాలు సరిగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. 2025 జనవరి నాటికి 18 ఏళ్లు నిండే వారిని గుర్తించి వారితో ఓటు హక్కు నమోదుకు దరఖాస్తు చేయించాలని బీఎల్ఓలను ఆదేశించారు. మృతుల పేర్లను జాబితా నుంచి తొలగించాలని సూచించారు. ఆమె వెంట జూనియర్ సహాయకులు ఎం.తిరుపతిరావు, వీఆర్ఓ నాగరాజు ఉన్నారు.

18 ఏళ్లు నిండిన వారందరికీ వైద్య పరీక్షలు



సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ రాణి

గంట్యాడ: పద్దెనిమిదేళ్లు నిండిన వారికి బీపీ, సుగర్, నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ కె.రాణి తెలిపారు. రామవరంలో శుక్రవారం చేపట్టిన క్యాన్సర్ సర్వేను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్యాన్సర్‌ను త్వరగా గుర్తిస్తే నయం చేయడానికి వీలుంటుందని తెలిపారు. ఖైనీ, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులు వల్ల నోటి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీపీఓ డాక్టర్ సుబ్రహ్మణ్యం, సీహెచ్ఓ రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ ఎర్రన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు

చీపురుపల్లి, గజపతినగరం, శృంగవరపుకోట నియోజకవర్గాల్లో వాడవాడలా కార్తీక పౌర్ణమి పూజలను ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివాలయాలకు ఉదయం, సాయంత్రం భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణాల్లో మహిళలు సాయంత్రం దీపారాధన చేశారు. శివ,పార్వతుల ఉత్సవ విగ్రహాలను మేళతాళాల మధ్య ఊరేగించారు. అనంతరం ఆలయాల వద్ద జ్వాలాతోరణాలను వెలిగించారు. – సాక్షి నెట్‌వర్క్



గుర్ల: గుర్ల శివాలయం వద్ద జ్వాలాతోరణంలో శివపార్వతుల పల్లకీ సేవ



లక్కవరపుకోట: రంగారాయపురం గ్రామంలో జ్వాలాతోరణం వెలిగించిన గ్రామస్తులు



మెరకముడిదాం: మెరకముడిదాంలో దీపారాధన చేస్తున్న మహిళలు

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



ఎల్.కోట గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని శాఖా గ్రంథాలయాల అధికారులు, ఉపాధ్యా యులు సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం గజపతినగరం, లక్కవరపు కోట, కొత్తవలస, వేపాడ, జామి శాఖా గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలను వివరించారు.

– గజపతినగరం/ లక్కవరపుకోట/వేపాడ /జామి/కొత్తవలస



జామి గ్రంథాలయంలో పుస్తకప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీడీఓ అప్పలనాయుడు,తదితరులు